స్కెచ్

# సరికొత్తమార్కు సంస్కర్త

తాతినేని వెంకట నరసింహారావు

"అంతా నాలాగే వుంటారా?"

"ఎప్పటికీ వుండరు. అందరూ అన్నివిధాలుగా వుంటారు."

"అదేమిటి, ఒకప్పుడు కారల్ మార్క్సు కూడా నావలె కూటికి కటకట లాడినవాడే. ఒక్క ఆయనేమిటి? గొప్పగొప్ప వాళ్లంతా అంతేగా."

"అయితే కూడులేక బాధపడే వాళ్ళంతా నీతో సమానమనా నీ ఉద్దేశ్యం?"

"నిస్సందేహంగా."

"మరి ప్రపంచంలో కోట్లకొలది అడుక్కునే వాళ్లున్నారు. వాళ్లు కూడా నీతో సమానమేగా?"

"అబ్బబ్బ నీతో వచ్చిన చావే అది. కనీసం గొప్పవాళ్ళతో పోల్చుకునైనా సంతోషించితే నీవు సహించలేవు గదా!"

"అవునులే. ఒకసారి జార్జి బెర్నాడ్ షా, ఈరోజుల్లో నిజం చెబితే హాస్యం అవుతుంది అన్నాడట."

"అది సరేగాని ప్రపంచమంతా అన్యాయంతో నిండి వుందని ఒప్పుకుంటావా?"

"ఆహాఁ. ఈ విషయంలో మాత్రం నీతో ఏకీభవిస్తాను. చూశావూ, ప్రతిదానికీ నిన్ను వ్యతిరేకించి ఏదో బావుకుందామనిగాదు నా వుద్దేశ్యం. అసలు నిన్ను సక్రమంగా నడపడానికే ఇక్కడ చుక్కానిలాగా పని చేస్తోంది! అయినా నన్ను అపార్థం చేసుకుని నానా తిట్లుతిట్టి నన్ను గాయపరుస్తావు. ఇంతకీ ఇదంతా నా ఖర్మ."

"అదే నీదగ్గరున్న చెడ్డగుణం. ఏదో కోపమొచ్చి నాలుగుతిట్లుతిట్టానని కంట నీరు పెడతావా! సరే. తెలియకడుగుతాను. ప్రపంచమంతా దుర్మార్గం, అన్యాయం, అవినీతితో పేరుకొనివుంటే ఎవరూ వాటిని రూపుమాపడానికి ప్రయత్నించలా?"

"ప్రయత్నించక పోవడమేమిటి? కాని పాపం అంతా విఫలులైపోయారు. అసలు సంఘ దురాచారాల్ని నాశనంచేయడం అసాధ్యం."

"అసాధ్యమేమిటి? ప్రయత్నించితే సాధ్యం కానిదేదీ ఉండదని ఒక మహాకవి చెప్పాడు. నేను తప్పకుండా లోకకళ్యాణంకోసం పాటుపడతాను. ఇది నా నిశ్చయం."

"ఒద్దు ఒద్దు నా మాట విను. నా మాట వినక అనేకసార్లు కష్టాలనుభవించావు. నేను వద్దన్నకొద్దీ డబ్బు తగలేసి చదివావు. చివరికి కూటికికూడా గతిలేనివాడవైపోయావు. ఎంతో మంది సంఘాన్నిగురించి బలైపోయారు."

"అదే నీ దగ్గరున్న బలహీనత. ఒక సంగతి చెబుతా విను పూర్వం యూరప్‌లో పెద్ద దురాచారం వుండేది. క్రిష్టియన్లు 'బ్రతికున్నంత కాలం' పాపాలుచేసి చనిపోయే దశలో భృత్యుడు యజమానికి చెప్పే జమాఖర్చులాగు పాపాలన్నీ దేవునిముందు ఏకరువు పెట్టి పాప పరిహారపత్రాలు కొన్నట్లయితే విముక్తి కౌగలం అనే నమ్మకంతో వుండేవారు. సంఘాన్నంతటినీ ప్రతిఘటించి మార్టిన్ లూథర్ అనే గొప్ప మేధావి విజయం పొందలేదా? ప్రాణంపోతేపోయింది సంఘాన్ని సంస్కరించడం ఘనకార్యం అంటావా కాదా?"

"సరే నీయిష్టం" అంది ఆత్మ ఎంతో నిరుత్సాహంగా.

* * *

"నీవు ఏమి చూసుకొని బ్రతుకుతున్నావు" అన్నాను. ఎదుటివ్యక్తి ఉలిక్కిపడ్డాడు, ఒకేసారి ఇంత ప్రశ్న వేసినందుకు. రైలు వేగంగా సాగిపోతోంది.

"ఏమిచూసుకు నేమిటి? నన్ను చూసుకుని, నా పెళ్ళాన్ని చూసుకుని, నాపిల్లల్ని చూసుకుని" అన్నాడా వ్యక్తి కొంచెం తమాయించుకుని.

"అయితే, మీరు బ్రతకడం అనవసరం" అన్నాను. కొంచెం కోపం వచ్చినట్టుంది. అంతలోకే సంతోషం తెచ్చుకుంటూ—

"ఎందుకని?"

"అంతే"

"ఆ రహస్యమేమిటో కొంచెం చెప్పండి స్వామీ. అనుసరిస్తాం" అన్నాడు ఎదుటివ్యక్తి కొంచెం దీనంగా.

"రోజుకు ఎన్నిసార్లు నీ పెళ్ళాంతో పోటాడుతావు?" అన్నాను.

"రోజుకు కనీసం ఒకసారైనా వుంటుంది" అన్నాడు నవ్వుతూ.

"పిల్లల్ని ఎన్నిసార్లు కొడతావు?"

"రోజూ కొట్టనుగాని అప్పుడప్పుడూ."

"ఏదో వుద్యోగం చేస్తున్నట్టున్నావ్. రోజుకెన్నిసార్లు నీ పైఆఫీసరుతో తిట్లుతింటావు?"

"ఆ ఫలహారం రోజూ వుంటుంది" అన్నాడు చిరాకుతో. "చేతిలో కానీవుండదు. ఇంట్లో సుఖం వుండదు. వీధిలో గౌరవం వుండదు. ఇవన్నీ దారిద్ర్యం వల్లేగా. ఇన్ని కష్టాలతో ఎందుకు ఇంకా బ్రతికివున్నావ్?"

"చావలేక!" పెట్టెలో వాళ్ళంతా గొల్లుమన్నారు. అంతా నావంక పరిహాసంగా చూస్తున్నారు.

"నవ్వుతారెందుకయ్యా. మీకు ప్రపంచ జ్ఞానం శూన్యం. అందుకనే చెబుతున్నా వినండి. మానవుడు కోరేది సుఖమని మీరందరూ ఒప్పుకుంటారు. అన్నిటిలో సుఖవంతమైనది చావు. అందుకని సుఖపడాలనుకున్న వాళ్ళంతా ముందు చావాలి. అప్పుడు షావుకార్లు పీడించడానికి లేక ఆఫీసర్లు తిట్టడానికి లేక, నాయకులు పాలించడానికి లేక తిరిగి మనల్ని బ్రతికించమని దేవుణ్ణి ప్రార్థిస్తారు. అంటే మనతో సంధికి దిగుతారన్న మాట. అప్పుడు దుర్మార్గం నశిస్తుంది. అవినీతి రూపు లేకుండా పోతుంది. శాంతి సుఖాలు శాశ్వతంగా లభిస్తయ్. అప్పుడే మనకు స్వర్గం. అంతేగాని మనం ఈ మురికి కూపంలో పడి కొట్టుకుంటే విముక్తిలేదు" అని చిన్న ఉపన్యాసం ఇచ్చాను. పెట్టెలోనివాళ్ళంతా తీవ్రంగా ఆలోచిస్తున్నారు నా రిజల్యూషన్ గురించి. అంతలోకి ఒక పెద్దమనిషి—

"మహాత్మా మీపేరు సెలవిస్తారా?"

"నా పేరు సదానంద నరసింహస్వామి" అని నొక్కి పలుకుతూ గంభీరంగా ఠీవి చూపిస్తూ అన్నాను.

ఇంతలోకి రైలు ఎందుకు వృథాగా పోనివ్వాలని (మానవ జీవితం బుద్బుదప్రాయం గదండీ) కొంచెం అవతలకి వెళ్ళాను. పసుపు బట్టలూ ఆవీనూ—పెళ్ళికూతురులాగుంది, నెమ్మదిగా అడిగాను—

"అమ్మాయ్ పెళ్ళెందుకు చేసుకున్నావ్?"

ఆమెకు సిగ్గేసుంటుంది. మాట్లాడలేదు.

"ఎందుకేమిటి? సుఖంకోసం" అన్నాడు ఆమె భర్త.

"ఈ ప్రపంచంలో సుఖంలేదని తెలుసా?"

"తెలియదు స్వామీ"

"తెలియకుండా పెళ్ళెందుకు చేసుకున్నావ్" అన్నా.

"తప్పేనండీ" అన్నాడు. పాపం పెళ్ళికూతురు చిన్నపోయింది.

"తప్పని ఒప్పుకున్నంత మాత్రాన మన హిందూమతంలో క్షమించబడం నాయనా. ఇవాళ పెళ్ళి చేసుకున్నావ్. కొద్దికాలంలో పిల్లల్ని కంటావ్. తరువాత వాళ్ళకోసం యమయాతనపడతావ్. సుఖపడాలంటే దారిద్ర్యం పోవాలి. సంఘంలో మోసం, దోపిడి, అన్యాయం వున్నంతకాలం సామాన్య ప్రజలు నలిగిపోవాల్సిందే. ఎలాగంటే చెరువులో గండుచేపలున్నంత కాలం చిన్న చేపలకు రక్షణ లేనట్లు" అన్నాను.

అంతలో టికెట్ కలెక్టర్ గాబోలు 'టికెట్' అన్నాడు నన్నూ నా వేషాన్ని చూసి. నా ఒళ్ళు మండిపోయింది.

పళ్ళు పటపటకొరికాను. చెయ్యి పైకెత్తాను. బల్ల విరిగి పోయేట్టు గుద్దేను. పెట్టంతా నిశ్శబ్దంగావుంది. నా వుద్రేకం అంతా తెచ్చుకుని "సోదర సోదరీమణులారా! వీడు - అంటే టికెట్ కలెక్టర్-మన వ్యక్తి స్వాతంత్ర్యాన్ని నాశనం చేయడానికి చూస్తున్నాడు. భూదేవి మన తల్లి. తల్లితో ఆడుకోడానికి మనకు సర్వహక్కులూ వున్నయ్. ఆడతాం, పాడతాం,

గంతులేస్తాం. మనల్ని అడ్డుపెట్టడానికి యెవరికీ హక్కులేదు. మన జీవితం నిర్మలంగా వుండాలంటే, మనం సుఖపడాలంటే మనకు అన్ని విధములయిన స్వాతంత్ర్యమూ వుండాలి. అందుకు మార్గం మనం అందరమూ చావాలి. రైళ్ళూ, కార్లూ, విమానాలూ, పంటలూ, కాలువలూ, ఫ్యాక్టరీలు, ధనికుల గుండెలూ, ఒకటేమిటి సమస్తం మనం చనిపోతే ఆగిపోతయ్. అప్పుడు మిగుల్తారు చూశారూ ధనికులూ, ఆఫీసర్లు, దోపిడిగాళ్లు, రజాకార్లు అంతా తమతమ లాభాలు పోయినవని తిరిగి మనల్ని బ్రతికించమని దేవుడిదగ్గరకొక రాయబారవర్గం పంపిస్తారు. అప్పుడు మన కోర్కెలన్నీ సఫలమౌతయ్. టికెట్ కలెక్టర్ దౌర్జన్యం అంతా నాశనమౌతుంది. దారిద్ర్యం మాయమౌతుంది. సంఘంలో అవినీతి దుర్మార్గం ఇంకా అన్ని దుర్గుణాలు సమసిపోతయ్ మన కోర్కెలు సఫలమౌతవి. పదండి, ముందు మన కర్తవ్యాన్ని నెరవేరుద్దాం. రైల్లోనుంచి దూకి చనిపోదాం. మీకొక నాయకుడూ మార్గదర్శకుడూ కావాలా అయితే నేనే ముందు దూకుతా''నని రైల్లోనుంచి దూకేశాను!

# ఆంధ్రరాష్ట్రం—ఉర్దూ భాష

భాషారాష్ట్రాల నిర్మాణం జరిగితే ఆయా రాష్ట్రాలలో యితర భాషలకు చెందిన అల్పసంఖ్యాకుల విషయం ఒక సమస్యగా తయారవుతుందని చెప్పిన కేంద్రమంత్రి కిద్వాయిగారికి స్వామీ సీతారాంగారు చక్కటి సమాధానం యిచ్చారు. "ఆంధ్రదేశంలో నూటికి 15 మంది ముస్లింలు ఉన్నారు. వారంతా తెలుగు భాష తెలిసినవారే. వారి కేవిధమైన సౌకర్యాలు కావాలన్నా, మున్ముం దేర్పడే ప్రభుత్వం కల్పించగలదు" అని ఆంధ్ర ముస్లింలకు స్వామీ సీతారాంగారు వాగ్దానంచేశారు. ఉర్దూభాష సమస్య ఆంధ్రరాష్ట్ర ఉద్యమాని కేవిధంగాను అపకారికాదు. కాని ఆంధ్రరాష్ట్రములో ఉర్దూ సమస్య ఒకటి వున్నదని మాత్రం గుర్తించాలి రీజియనల్ భాష కాక ప్రత్యేకమైన మాతృభాష కలిగిన మైనారిటీ ఒక్క ఆంధ్రలో తప్ప యితర రాష్ట్రాలలో లేదు. కాబట్టి ఈసమస్య ఒక్క ఆంధ్రదేశంలోనే ఉంటుంది.

స్వామీ సీతారాంగారి మొదటి సత్యాగ్రహ దినాలలో ఈ విషయాలనుగూర్చి ఆయనకు లేఖ వ్రాశాను. అందులోని న్యాయాన్నిగూర్చి తమ ఆమోదాన్ని తెలుపుతూ శ్రీవారు జవాబుకూడా వ్రాశారు. ఐనప్పటికీ ఈ విషయాన్ని గూర్చి బహిరంగంగా చర్చించవలసిన అవసరంకూడా వున్నది. ఈ ఉర్దూ భాషకు శ్రీ ప్రకాశం పంతులుగారి ప్రధాన మంత్రిత్వములో అన్యాయం జరిగింది. ఇంగ్లీషు భాషకు బదులుగా మాతృభాషలోనే విద్య గరపాలన్న సమస్యపై అసెంబ్లీలో చర్చలు జరిగినవి. ఆంధ్ర ప్రాంతంలో ముస్లింల మాతృభాష ఉర్దూ గాబట్టి ఉర్దూకు సముచితమైన సౌకర్యాలు కావాలని కొందరు సభ్యులు కోరారు. ఆ రోజుల్లో శ్రీ ప్రకాశంగారు, విద్యామంత్రి శ్రీ అవినాశలింగం చెట్టియారుగార్ల ఉర్దూ వ్యతిరేక భావాలు ముస్లింలను కల్లోలపరచినవి, కించపరచినవి. అప్పటినుండి ప్రభుత్వం ఉర్దూ భాషను నెమ్మది నెమ్మదిగా తగ్గించుకుంటూ వస్తోంది. గుంటూరులోనున్న ఏకైక ఉర్దూ ట్రయినింగు స్కూలును ఎత్తివేశారు. ట్రయినింగు స్కూలు లేకపోవుటచే ఉర్దూ టీచర్ల కొరత ఏర్పడ్డది. కొద్ది సంవత్సరాలలో ఆంధ్రదేశంలో ఉర్దూ టీచర్లే దొరకరు. ఉర్దూ భాషను పూర్తిగా నాశనం చేయాలనేది ప్రభుత్వ సంకల్పంగా కనిపిస్తోంది.

ఆంధ్రదేశంలోని ముస్లింలు ఆంధ్రరాష్ట్ర నిర్మాణానికి సుముఖులే. కాని వారి మాతృభాష అయిన ఉర్దూ భాషకు సముచితమైన సౌకర్యాలు మన ఆంధ్రరాష్ట్రంలో కావాలని మాత్రం కోరుతున్నారు. ఆంధ్రోద్యమ నాయకులు, ఆంధ్ర ప్రజలు యీ విషయాన్ని గుర్తించాలని నా విన్నపము.

—మహబూబ్ అదం